మరో ప్రజా సంకల్పం

ఆదివారం, 18 అక్టోబరు 2026 | Evening News Bulletin | పేజీలు : 8

ప్రతి రోజూ సాయంత్రం మరో ప్రజాసంకల్పం ఈ-పేపర్‌లో వచ్చే సమాచారం కోసం ఈ QR కోడ్‌ను స్కాన్ చేసి వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి.

ఇది నారాసుర రక్తచరిత్ర

స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు అరాచకాలపై వైయస్ జగన్ నిప్పులు

రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా?

రాజ్యాంగబద్ధమైన పాలన సాగుతోందా?



నామినేషన్లు వేయనీయకుండా వైయస్సార్‌సీపీ అభ్యర్థులపై దాడులు, అక్రమ కేసులు

- పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డిపై హత్యాయత్నం..
- మూడు గంటలు వేచిచూసినా నామినేషన్ స్వీకరించని అధికారులు
- పులివెందులలో పోలీసులే గుండాలుగా మారారు.. లాఠీఛార్జ్, గాల్లోకి కాల్పులు
- తిరుపతి, కడప, రాజంపేటల్లో మహిళా అభ్యర్థులపైనా దాడులు
- రాయచోటిలో వైయస్సార్‌సీపీ కార్యాలయానికి నిప్పు.. వాహనాల దహనం
- నామినేషన్ పత్రాలు చించేస్తున్నా చోద్యం చూస్తున్న పోలీసులు

ప్రజాబలం ఉంటే ప్రతిపక్ష అభ్యర్థులను చూసి భయమెందుకు?

- చంద్రబాబు ఎక్స్‌టెన్షన్ గవర్నమెంట్‌గా రాష్ట్ర ఎన్నికల సంఘం
- మా హయాంలో ప్రజలకు మంచి చేసి స్థానిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించాం
- ఎస్ఈసీ, సీఈసీ నియామక విధానాల్లో సమూల మార్పులు రావాలి
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం ఆగదు..
- తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని హెచ్చరిక

రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ అధ్వర్యంలో నారాసుర రక్తచరిత్ర సాగుతోందని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ప్రజల మద్దతుతో గెలిచే ధైర్యం లేకనే చంద్రబాబు ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు కూడా వేయనీయకుండా దాడులు, అక్రమ కేసులు, అరెస్టులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన పోలీసులు అధికార పార్టీకి వాచ్‌మెన్లుగా మారారని, స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించాల్సిన రాష్ట్ర ఎన్నికల సంఘం చంద్రబాబు ఎక్స్‌టెన్షన్ గవర్నమెంట్‌గా వ్యవహరిస్తోందని విమర్శించారు. పుంగనూరు, పులివెందుల, తిరుపతి, కడప, రాయచోటి, రాజంపేట సహా రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్‌సీపీ అభ్యర్థులపై జరుగుతున్న దాడులు, నామినేషన్ పత్రాల చించివేత, పోలీసుల దౌర్జన్యాలకు సంబంధించిన వీడియోలను ఆదివారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రదర్శించారు. మూడు రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అసలు ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా అన్న అనుమానం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు తమ పోరాటం ఆగబోదని, అధికార దుర్వినియోగానికి పాల్పడిన ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో చట్టానికి సమాధానం చెప్పాల్సిందేనని హెచ్చరించారు.

- మిగతా 2-5 పేజీల్లో..



స్టేట్ ఎలక్షన్ కమిషనర్ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన వైయస్ జగన్

ఒక్క అభ్యర్థి నామినేషన్ వేయలేకపోయినా ఎస్ఈసీదే బాధ్యత

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠతో భేటీ అనంతరం వైయస్ జగన్

- మిగతా 6,7 పేజీల్లో..

ఇది నారాసుర రక్తచరిత్ర

స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు అరాచకాలపై వైయస్ జగన్ నిప్పులు



నామినేషన్ వేయడమూ నేరమేనా?

ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ వేయడం అభ్యర్థుల హక్కని, ఆ కనీస అవకాశాన్ని కూడా చంద్రబాబు ప్రభుత్వం కాలరాస్తోందని వైయస్ జగన్ మండిపడ్డారు. నామినేషన్ కేంద్రాల వద్ద ముందుగానే టీడీపీ మూకలను మోహరించడం, ప్రతిపక్ష అభ్యర్థులను అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలు లాక్కోవడం, పోలీసుల సమక్షంలోనే వాటిని చించివేయడం వంటి ఘటనలు గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. రిటర్నింగ్ అధికారుల చేతుల్లోని నామినేషన్ పత్రాలను కూడా టీడీపీ శ్రేణులు లాక్కుంటున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. రిజర్వేషన్లు ప్రకటించిన రెండో రోజే నామినేషన్లు ప్రారంభించి, కేవలం మూడు రోజుల గడువు ఇవ్వడం వెనుక కుట్ర ఉందన్నారు. అధికార పార్టీకి రిజర్వేషన్ల వివరాలు ముందుగానే తెలిసేలా చేసి, ప్రతిపక్షానికి సన్నద్ధమయ్యే అవకాశం లేకుండా చేశారని ఆరోపించారు. కుల ధ్రువీకరణ పత్రాలు, నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా అడ్డుకున్నారని, బైండోవర్ పేరుతో అభ్యర్థులను బెదిరించారని తెలిపారు.

ప్రజాబలం ఉంటే భయమెందుకు?

ప్రజల మద్దతు ఉందని భావిస్తే వైయస్సార్సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని చంద్రబాబును జగన్ నిలదీశారు. పోలీసులతో అభ్యర్థులను ఎందుకు ఎత్తుకెళ్తున్నారు? అక్రమ కేసులు ఎందుకు పెడుతున్నారు? పార్టీ నాయకులపై దాడులు ఎందుకు చేయిస్తున్నారు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను గాలికొదిలేసి, అన్నీ అమలు చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, అందుకే ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించే ధైర్యం చంద్రబాబుకు లేదన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ పూర్తికాకముందే ఎన్నికలకు వెళ్లడం, వార్డులు, డివిజన్లను ఇష్టానుసారం మార్చడం, వైయస్సార్సీపీ ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతాలను విడగొట్టడం, పోలింగ్ కేంద్రాలను దూరంగా ఏర్పాటు చేయడం వంటి చర్యలతో ఎన్నికల ప్రక్రియను తమకు అనుకూలంగా మార్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 45 లక్షల దొంగ ఓట్లు ఉన్నట్లు ప్రత్యేక సవరణలో వెల్లడైందని పేర్కొన్న జగన్.. ఓటర్ల తుది జాబితా రాకముందే ఎన్నికలకు వెళ్లడం వెనుక కుట్ర ఉందన్నారు.

పుంగనూరులో ఎంపీపైనే హత్యాయత్నం

పుంగనూరులో వైయస్సార్సీపీ లోక్‌సభ పక్ష నేత, రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డిపై జరిగిన దాడిని జగన్ తీవ్రంగా ఖండించారు. పార్టీ అభ్యర్థులతో నామినేషన్లు వేయించేందుకు వెళ్లిన మిథున్‌రెడ్డిని టీడీపీ మూకలు అడ్డుకుని హత్యాయత్నానికి పాల్పడ్డాయని ఆరోపించారు. ఆయన భద్రతా సిబ్బందికి తలలు పగిలేలా దాడి చేశారని, వాహనాలను ధ్వంసం చేశారని తెలిపారు. మూడు గంటలపాటు వేచి చూసినా నామినేషన్లు స్వీకరించలేదన్నారు. దాడి అనంతరం ధ్వంసమైన వాహనాల్లో మద్యం సీసాలు పెట్టి ఎంపీపై దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. కార్లు తిరగబడినా, ధ్వంసమైనా మద్యం సీసాలు నిటారుగా ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. మిథున్‌రెడ్డి మద్యం సేవించరని, ఆయనపై బురదజల్లేందుకు ఈ కుట్ర చేశారని ఆరోపించారు. అదే నామినేషన్ కేంద్రం వద్ద శాప్ చైర్మన్ రవినాయుడు పోలీసుల మైక్ తీసుకుని దాడులు చేస్తామని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. సంబంధిత వీడియోలను మీడియాకు ప్రదర్శించారు.

రక్తంతో తడిచిన చొక్కాతో ఎంపీ మిథున్‌రెడ్డి.. నామినేషన్ తీసుకోని రిటర్నింగ్ అధికారి



ధ్వంసమైన కారులో లిక్కర్ బాటిల్స్ తెచ్చి నిలబెట్టిన టీడీపీ నేతలు





తిరుపతిలో మేయర్ అభ్యర్థికి అవమానం

తిరుపతిలో వైయస్సార్సీపీ మేయర్ అభ్యర్థి వాసూ యాదవ్‌ను నామినేషన్ వేయనీయకుండా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయని జగన్ ఆరోపించారు. ఆయన వెంట వెళ్లిన తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తిని కూడా అడ్డుకున్నారని, పోలీసుల సమక్షంలోనే నామినేషన్ పత్రాలను లాక్కునేందుకు ప్రయత్నించారని తెలిపారు. మధ్యాహ్నం మరోసారి ప్రయత్నించినా అవకాశం ఇవ్వలేదన్నారు. భద్రత కల్పించాలని ఎస్పీని కోరినా స్పందించలేదని విమర్శించారు. వాసూ యాదవ్ తన తల్లితో కలిసి వర్షంలో తడుస్తూ ఆందోళన చేసిన వీడియోను ప్రదర్శించారు. తన ప్రెస్‌మీట్ జరుగుతున్న సమయానికి తిరుపతిలో ఒక్క కార్పొరేటర్ అభ్యర్థి కూడా నామినేషన్ వేయలేదని, మేయర్ అభ్యర్థి మాత్రం తీవ్ర ప్రయత్నాల తర్వాత నామినేషన్ దాఖలు చేశారని తెలిపారు.

నామినేషన్ దాఖలు చేయాలంటూ ఎస్పీకి వైయస్సార్ సీపీ అభ్యర్థుల వినతి



ఎంపీ గురుమూర్తి నుంచి నామినేషన్ పత్రాలను పోలీసుల సమక్షంలోనే లాక్కొన్న టీడీపీ రౌడీలు



ఇది నారాసుర రక్తచరిత్ర

స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు అరాచకాలపై వైయస్ జగన్ నిప్పులు



కడపలో కత్తులతో దాడులు

కడప కార్పొరేషన్ పరిధిలో వైయస్సార్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా కత్తులతో దాడులు చేయించారని జగన్ మండిపడ్డారు. మాజీ కార్పొరేటర్ కుమారుడు మురాద్‌పై కత్తితో దాడి చేశారని, తన మరదలితో నామినేషన్ వేయించేందుకు వెళ్లిన మాజీ డిప్యూటీ మేయర్‌పైనా దాడి జరిగిందన్నారు. నామినేషన్లు వేయడానికి వస్తే చంపేస్తామని కడప ఎమ్మెల్యే భర్త శ్రీనివాసులురెడ్డి బహిరంగంగా బెదిరించారని ఆరోపించారు. ఈ ఘటనలన్నీ పోలీసుల సమక్షంలోనే జరిగినా ఎవరిపైనా చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మహిళలను సైతం వదలకుండా దాడులు చేయించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏ నా కొ.డైనా నామినేషన్ వేయమను చూద్దాం అంటూ కడప ఎమ్మెల్యే భర్త వార్నింగ్



కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి మేనల్లుడు మనోజ్ రెడ్డి దాష్టీకం... రాళ్ల దాడి



రాజంపేటలో వైఎస్సార్ సీపీ చైర్మన్ అభ్యర్థి నడిగడ్డ రేష్మ పై దాడికి యత్నం



మహిళలపైనా దాడులా చంద్రబాబూ?

రాజంపేటలో వైయస్సార్‌సీపీ మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన బీసీ మహిళపై, ఆమె తండ్రిపై దాడి జరిగిందని జగన్ తెలిపారు. పుంగనూరులో తొమ్మిదో వార్డు అభ్యర్థి నయాజ్ తన భార్యతో కలిసి నామినేషన్ వేయడానికి వెళ్తుండగా పోలీసుల సమక్షంలోనే దాడి చేసి పత్రాలు లాక్కున్నారని వివరించారు. మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు రావడమే అరుదని, అలాంటి మహిళలపైనా దాడులు చేయించడం చంద్రబాబుకు సిగ్గుచేటని మండిపడ్డారు. మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని నిలదీశారు.



పులివెందులలో పోలీసులే గుండాలు!

పులివెందులలో జరిగిన పరిణామాలు పోలీసు వ్యవస్థ ఎంతగా దిగజారిపోయిందో తెలియజేస్తున్నాయని జగన్ విమర్శించారు. నామినేషన్ల దాఖలుకు సంబంధించి ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి ఎస్పీ, డీఐజీల దృష్టికి పరిస్థితిని తీసుకెళ్లగా మధ్యాహ్నం 1.30 గంటలకు రావాలని సూచించారని తెలిపారు. ఆ సమయానికి అవినాష్‌రెడ్డి వెళ్లగానే పోలీసులే అడ్డుకుని లాఠీఛార్జ్ చేశారని, ఏకే-47తో గాల్లోకి కాల్పులు జరిపారని ఆరోపించారు. పోలీసులే కార్లను ధ్వంసం చేశారని, రాళ్లు విసిరారని మండిపడ్డారు. ఇప్పటివరకు టీడీపీ మూకలకు సహకరించిన పోలీసులు పులివెందులలో స్వయంగా గుండాల పాత్ర పోషించారని విమర్శించారు. ఇందుకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు.

నామినేషన్ వేయడానికి వెళ్తుండగా లాఠీచార్జ్ చేసిన పోలీసులు



పులివెందులలో వైయస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై టియర్ గ్యాస్ ప్రయోగిస్తున్న



పులివెందులలో పోలీసుల కాల్పులు



పులివెందులలో గడికోట పవన్ కుమార్ పై కత్తిపోట్లు.. కాలికి, చేతికి తీవ్ర గాయాలు



ఇది నారాసుర రక్తచరిత్ర

స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు అరాచకాలపై వైయస్ జగన్ నిప్పులు



రాయచోటిలో కార్యాలయానికి నిప్పు


రాయచోటిలో వైయస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పార్టీ కార్యాలయంలో ఉండగానే టీడీపీ శ్రేణులు దాడి చేసి కార్యాలయానికి నిప్పు పెట్టాయని జగన్ ఆరోపించారు. బయట ఉన్న వాహనాలను కూడా తగలబెట్టారని, ఛైర్మన్ అభ్యర్థిపై వరుసగా మూడు రోజులుగా దాడులు జరుగుతున్నాయని తెలిపారు. బద్వేలులో ఆర్వో కార్యాలయంలోకి చొరబడి ఇప్పటికే దాఖలైన నామినేషన్ పత్రాలను చించివేశారని ఆరోపించారు. దర్శిలోనూ అభ్యర్థులను అడ్డుకున్నారని, దాచేపల్లిలో ఛైర్మన్ అభ్యర్థి ఇంట్లో పోలీసులే తెలంగాణ మద్యం పెట్టి అక్రమ మద్యం కేసుతో అరెస్టు చేశారని విమర్శించారు. పిడుగురాళ్లలో అభ్యర్థిని పోలీసులు తీసుకెళ్లిన వ్యవహారంలో హైకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందన్నారు.

గడికోట శ్రీకాంత్ రెడ్డి YSRCP ఆఫీస్‌లో ఉండగానే నిప్పు పెట్టిన టీడీపీ గూండాలు



రాయచోటిలో పచ్చమూకల దాడిలో పూర్తిగా కాలిపోయిన కారు






ధర్మవరంలో చింపేసిన నామినేషన్ పత్రాలు




ధర్మవరంలో పోలీసుల సమక్షంలోనే దాడి చేస్తున్న టీడీపీ గూండాలు


బద్వేల్ లో నామినేషన్ పత్రాలను లాక్కెళ్తున్న టీడీపీ ఇంచార్జ్ సూర్యనారాయణరెడ్డి



ఆళ్లగడ్డలో వైయస్సార్ సీపీ అభ్యర్థుల నామినేషన్లు చించేసిన టీడీపీ మూకలు



మైదుకూరులో YSRCP అభ్యర్థుల నామినేషన్ పత్రాలను లాక్కొని చించివేసిన టీడీపీ గూండాలు



నామినేషన్లే వేయలేని దుస్థితి

రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో వైయస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయలేని పరిస్థితులు నెలకొన్నాయని జగన్ వివరించారు. బద్వేలులో 14 వార్డులకు నామినేషన్లు వేయాల్సి ఉండగా గతంలో దాఖలు చేసిన పత్రాలనే చించివేశారని తెలిపారు. కమలాపురం, ఎర్రగుంట్లలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని, జమ్మలమడుగులో ఛైర్మన్ అభ్యర్థి నామినేషన్ వేయలేకపోయారని పేర్కొన్నారు. రాయచోటిలో 44 డివిజన్లలో ఒక్క నామినేషన్ కూడా పడలేదని, పుంగనూరులోనూ అదే పరిస్థితి ఉందన్నారు. దర్శి, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్లలో ఛైర్మన్ అభ్యర్థులతో సహా పార్టీ నేతలను అడ్డుకున్నారని, పులివెందులలోనూ నామినేషన్లకు ఆటంకాలు సృష్టిస్తున్నారని వివరించారు. ప్రతిపక్షం ఎన్నికల్లో పోటీ చేయకుండానే గెలవాలన్న కుట్రలో భాగంగానే ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు.

పుంగనూరులో వైయస్సార్ సీపీ నామినేషన్లు చెత్తబుట్టలో వేసిన టీడీపీ మూకలు



దర్శిలో వైస్సార్సీపీ అభ్యర్థులపై దాడి చేసి నామినేషన్ పత్రాలు చించివేస్తున్న టీడీపీ గుండాలు



ఎమ్మార్పల్లి 12వ వార్డులో నామినేషన్ వేయడానికి వెళ్ళిన వైయస్సార్ సీపీ మహిళా అభ్యర్థిపై టీడీపీ మూకల విచక్షణారహిత దాడి.. ఇదంతా చూస్తూ పోలీసులు నవ్వుతున్నారని మహిళ ఆవేదన





ఇది నారాసుర రక్తచరిత్ర

స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు అరాచకాలపై వైయస్ జగన్ నిప్పులు

మా హయాంలో ప్రజాతీర్పు అలా!

వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక ఎన్నికల ఫలితాలను జగన్ గుర్తుచేశారు. అప్పటి ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలోనే ఎన్నికలు జరిగాయని, ఎస్పీలు, కలెక్టర్లను బదిలీ చేసిన పరిస్థితుల్లోనూ తమ పార్టీ ఘనవిజయం సాధించిందన్నారు. మొత్తం 724 కార్పొరేషన్ డివిజన్లలో 616 డివిజన్లు, 88 మున్సిపాలిటీల్లో 86 మున్సిపాలిటీలు తమ పార్టీ గెలుచుకుందని చెప్పారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు కలిపి మొత్తం 99 స్థానాల్లో 97 కైవసం చేసుకున్నామని వివరించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో అప్పటికే 95 శాతం అమలు చేశామని గుర్తుచేశారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ, నాడు-నేడు, ఫ్యామిలీ డాక్టర్, పేదలకు ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణం వంటి విప్లవాత్మక కార్యక్రమాల వల్లే ప్రజలు తమకు అఖండ విజయాన్ని అందించారని తెలిపారు. ప్రజలకు మంచి చేసి ఓట్లు అడగాలే తప్ప ప్రత్యర్థులను భయపెట్టి ఎన్నికల్లో గెలవాలని చూడటం సరికాదన్నారు.




ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు అవసరం

2024 సాధారణ ఎన్నికల ఫలితాలపైనా జగన్ మరోసారి అనుమానాలు వ్యక్తం చేశారు. అప్పట్లోనే ఎన్నికల ప్రక్రియలో అవకతవకలపై తాను ప్రశ్నించానని, కొందరు న్యాయస్థానాలను కూడా ఆశ్రయించారని తెలిపారు. ఎన్నికల సంఘాల నియామక విధానంలో మార్పులు తీసుకురాకపోతే ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడం కష్టమన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామకాన్ని ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కలిసి నిర్ణయించేలా వ్యవస్థ ఉండాలని ప్రతిపాదించారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకంలో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి భాగస్వామ్యం ఉండాలని అభిప్రాయపడ్డారు. గతంలో ప్రస్తుత నియామక విధానానికి తాము మద్దతిచ్చామని, ఆ నిర్ణయం తప్పని ఇప్పుడు భావిస్తున్నామని పేర్కొన్నారు.

చంద్రబాబు కనుసన్నల్లో ఎన్నికల సంఘం

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేట వ్యవహారశైలిపై జగన్ తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన కమిషన్ చంద్రబాబు కనుసన్నల్లో పనిచేస్తోందని ఆరోపించారు. నామినేషన్ కేంద్రాల వద్ద వందల మంది టీడీపీ శ్రేణులు మారణాయుధాలతో గుమిగూడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని, వైయస్సార్‌సీపీ తరపున నలుగురైదుగురు నిబంధనల ప్రకారం వెళ్లినా అడ్డుకుంటున్నారని తెలిపారు. రిటర్నింగ్ అధికారుల చేతుల్లో నుంచి నామినేషన్ పత్రాలు లాక్కుంటున్నా చర్యలు లేవన్నారు. ఇన్ని ఘటనలు జరుగుతున్నా ఎస్ఈసీ, డీజీపీ, హోం మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన బాధ్యతను నిర్వర్తించాలే తప్ప రాజకీయ నాయకుల ఆదేశాలకు లోబడకూడదని స్పష్టం చేశారు.



తప్పు చేసిన వారిని వదలం

అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న పోలీసు అధికారులు, టీడీపీ నాయకులు ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని జగన్ హెచ్చరించారు. నామినేషన్ల గడువు ముగిసే వరకు వైయస్సార్‌సీపీ పోరాటం ఆగబోదని స్పష్టం చేశారు. దాడులు, బెదిరింపులు, అక్రమ కేసులను ఎదుర్కొంటూ నిలబడిన ప్రతి కార్యకర్తకు, ప్రజాస్వామ్యవాదికి సెల్యూట్ చేస్తున్నానన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు చంద్రబాబుకు శాల్యూట్ చేయడం కాదని, రాజ్యాంగానికి విధేయులుగా పనిచేయాలని హితవు పలికారు. నేడు అధికారం ఉందని చేస్తున్న అన్యాయాలకు భవిష్యత్తులో చట్టం ముందు సమాధానం చెప్పాల్సిందేనన్నారు. ఇప్పుడు నాటుతున్న విత్తనాలు రేపు చెట్టవుతాయని హెచ్చరించారు. ఇది ప్రారంభం మాత్రమేనని, 2029 సాధారణ ఎన్నికలు ఫినిషింగ్ లైన్ అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, ప్రజల పక్షాన నిలబడేందుకు వైయస్సార్‌సీపీ ఎలాంటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు.





స్టేట్ ఎలక్షన్ కమిషనర్ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన వైయస్ జగన్

ఒక్క అభ్యర్థి నామినేషన్ వేయలేకపోయినా ఎస్ఈసీదే బాధ్యత

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠతో భేటీ అనంతరం వైయస్ జగన్

- నామినేషన్లకు అడ్డంకులు ఎదురయ్యే చోట ఎస్పీలే స్వయంగా ఎస్కార్ట్ ఇవ్వాలి
- అవసరమైతే గడువు పొడిగించైనా ప్రతి అభ్యర్థితో నామినేషన్ వేయించాలి
- నిష్పక్షపాత ఎన్నికల కోసం కేంద్ర పారామిలిటరీ బలగాలను దించాలి
- పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లలో సీసీ కెమెరాలు.. ప్రజలందరికీ లైవ్ ఫుటేజీ
- బ్యాలెట్ బాక్సుల భద్రతపై అనుమానాలు.. ప్రతి దశా పారదర్శకంగా ఉండాలి
- గురజాల నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్ అభ్యర్థుల అరెస్టులపై ఫిర్యాదు
- పోలీసులు చంద్రబాబుకు వాచ్‌మెన్లుగా మారారు.. వ్యవస్థను మాఫియాగా మార్చారు
- మిథున్‌రెడ్డిపై దాడికి సీఆర్పీఎఫ్ సిబ్బందే ప్రత్యక్ష సాక్షులు
- డీఐజీ కోయ ప్రవీణ్ తీరు టీడీపీ కార్యకర్తను తలపిస్తోంది
- ప్రజాస్వామ్య హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే
- ఎస్ఈసీ నుంచి హామీ లభించింది.. అమలు చేస్తేనే చిత్తశుద్ధి తెలుస్తుంది



స్టేట్ ఎలక్షన్ కమిషనర్ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠను కలిసి వినతిపత్రం అందజేసిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా వైయస్సార్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా సాగుతున్న దౌర్జన్యాలను అరికట్టాలని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఒక్క అభ్యర్థి కూడా నామినేషన్ వేయలేకపోయానని చెప్పే పరిస్థితి ఉండకూడదని, అలా జరిగితే పరువు పోయేది రాష్ట్ర ఎన్నికల సంఘానిదేనని స్పష్టం చేశారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన రాజ్యాంగబద్ధమైన బాధ్యతను గుర్తించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠకు సూచించారు. ఎన్నికల ప్రక్రియను చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసం పణంగా పెట్టవద్దని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్‌సీపీ అభ్యర్థులు ఎదుర్కొంటున్న అడ్డంకులు, దాడులు, అక్రమ అరెస్టులు, పోలీసుల ఏకపక్ష వైఖరికి సంబంధించిన వివరాలను ఎన్నికల కమిషనర్‌కు అందజేశారు. అవసరమైతే నామినేషన్ల గడువును పొడిగించి, ఎస్పీల పర్యవేక్షణలో ప్రతి అభ్యర్థితో నామినేషన్ వేయించాలని కోరారు. స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర పారామిలిటరీ బలగాలను మోహరించాలని, పోలింగ్ మొదలు ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశను సీసీ కెమెరాల ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. విజయవాడలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌తో సమావేశమైన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు.

ఒక్క నామినేషన్ ఆగినా బాధ్యత మీదే!

రాష్ట్రంలో ఎక్కడైనా ఒక్క అభ్యర్థి తాను ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నా నామినేషన్ వేయనివ్వలేదని చెప్పే పరిస్థితి తలెత్తితే అది ఎన్నికల సంఘం వైఫల్యమే అవుతుందని జగన్ స్పష్టం చేశారు. నామినేషన్లకు ఆటంకాలు ఎదురవుతున్న ప్రాంతాల్లో జిల్లా ఎస్పీలే స్వయంగా పోలీసు ఎస్కార్ట్ ఏర్పాటు చేసి అభ్యర్థులతో నామినేషన్లు వేయించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా తమకు అందిన తాజా సమాచారంతో కూడిన జాబితాను ఎన్నికల కమిషనర్‌కు అందజేసినట్లు తెలిపారు. ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకొచ్చేందుకు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని అక్కడే ఉంచినట్లు వివరించారు. అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి అవసరమైన పోలీసు రక్షణ కల్పిస్తామని, అవసరమైతే గడువు పొడిగించి అయినా ప్రక్రియ పూర్తి చేయిస్తామని ఎన్నికల కమిషనర్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

అరెస్టు చేసిన అభ్యర్థులను తీసుకురావాలి

గురజాల నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీల్లో వైయస్సార్‌సీపీ చైర్‌పర్సన్ అభ్యర్థులను పోలీసులే తప్పుడు కేసులతో అరెస్టు చేసి పోటీ చేయకుండా అడ్డుకుంటున్నారని జగన్ ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆ అభ్యర్థులను తీసుకొచ్చి పోలీసు రక్షణతో నామినేషన్లు వేయించాలని కోరారు. అభ్యర్థులను అరెస్టు చేసి ఎన్నికల బరి నుంచి తప్పించే పరిస్థితులు ప్రజాస్వామ్యంలో ఉండకూడదని స్పష్టం చేశారు. నామినేషన్ల దాఖలు సమయంలోనే ఇన్ని ఆటంకాలు సృష్టిస్తుంటే ఇక ఎన్నికలు స్వేచ్ఛగా ఎలా జరుగుతాయని ప్రశ్నించారు.

కేంద్ర బలగాలను దించాల్సిందే!

రాష్ట్ర పోలీసు యంత్రాంగం ఏకపక్షంగా చంద్రబాబు ప్రభుత్వానికి కొమ్ముకాస్తోందని, అందువల్ల స్థానిక ఎన్నికలను కేంద్ర భద్రతా బలగాల పర్యవేక్షణలో నిర్వహించాలని జగన్ డిమాండ్ చేశారు. నామినేషన్ కేంద్రాలకు వైయస్సార్‌సీపీ అభ్యర్థులు పరిమిత సంఖ్యలో వెళ్తుంటే, అక్కడ అప్పటికే వందల మంది టీడీపీ శ్రేణులు మారణాయుధాలతో మోహరించి ఉంటున్నారని ఆరోపించారు. అభ్యర్థులు వచ్చిన వెంటనే వారి చేతుల్లోని నామినేషన్ పత్రాలను లాక్కుని చించేస్తున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర పోలీసులపైనే ఆధారపడి నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదన్నారు. కేంద్ర పారామిలిటరీ బలగాలను మోహరించాలని ఎస్ఈసీని కోరినట్లు తెలిపారు. ఇదే అంశంపై సాయంత్రం గవర్నర్‌ను కూడా కలిసి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని కోరనున్నట్లు వెల్లడించారు.



స్టేట్ ఎలక్షన్ కమిషనర్ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేరను కలిసి వినతిపత్రం అందజేసిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్

ఒక్క అభ్యర్థి నామినేషన్ వేయలేకపోయినా
ఎస్ఈసీదే బాధ్యత

పోలింగ్ నుంచి కౌంటింగ్ వరకు లైవ్

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం పోలింగ్ కేంద్రాల లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యక్ష ఫుటేజీని ప్రజలకు అందుబాటులో ఉంచాలని జగన్ కోరారు. పోలింగ్ కేంద్రాల్లో ఏం జరుగుతుందో సామాన్య ప్రజలు కూడా తెలుసుకునేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌లలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటి లైవ్ ఫీడ్‌ను ప్రజలు వీక్షించేలా చూడాలని సూచించారు. చంద్రబాబు ప్రభుత్వంపై తమకు నమ్మకం లేదని, స్ట్రాంగ్‌రూమ్‌లలో బ్యాలెట్ బాక్సులను మార్చే ప్రయత్నాలు జరుగుతాయేమోనన్న అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోనూ ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లు ఉండాలని, పోలింగ్ అనంతరం నమోదయ్యే పత్రాలు, సంతకాల పరిశీలన కూడా కెమెరాల పర్యవేక్షణలో జరగాలని కోరారు. ముఖ్యంగా ఫారం 17సీకి సంబంధించిన సంతకాల ధ్రువీకరణ ప్రక్రియలో ఎలాంటి ఫోర్జరీలకు అవకాశం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్లను పార్టీ నాయకులు, ఎమ్మెల్సీలు గతంలోనూ ఎన్నికల సంఘానికి లిఖితపూర్వకంగా అందజేశారని, ఇప్పుడు మరోసారి స్వయంగా వివరించినట్లు తెలిపారు.



హామీల అమలుతోనే చిత్తశుద్ధి తెలుస్తుంది

తమ వినతులన్నింటినీ ఎన్నికల కమిషనర్ సానుకూలంగా విన్నారని జగన్ తెలిపారు. అభ్యర్థులతో నామినేషన్లు వేయిస్తామని, అవసరమైతే గడువును పొడిగిస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. అయితే ఎన్నికల సంఘం నిజంగా పారదర్శకంగా వ్యవహరిస్తుందా లేదా అన్నది ఆ హామీల అమలుతోనే తేలుతుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే స్వేచ్ఛ, నచ్చిన అభ్యర్థికి ఓటు వేసే స్వేచ్ఛ ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కులని గుర్తుచేశారు. ఆ హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషనర్‌పైనే ఉందని స్పష్టం చేశారు.

పోలీసు వ్యవస్థను మాఫియాగా మార్చారు!

రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను చంద్రబాబు తన రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని జగన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఐజీల నుంచి డీఎస్పీలు, సీఐల వరకు కొందరు అధికారులు ఒక సిండికేట్‌గా ఏర్పడ్డారని ఆరోపించారు. ఒకే ప్రాంతంలో రెండేళ్లకు మించి కొనసాగించకూడదనే నిబంధనలను పట్టించుకోకుండా రెండున్నరేళ్లుగా అదే అధికారులను కొనసాగిస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలతో కలిసి ఇసుక, మద్యం వ్యాపారాల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని, ఆ సొమ్మును అధికార పార్టీ నేతలకు పంచుతున్నారని ఆరోపించారు. ఇలాంటి అధికారులతోనే ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు ప్రజలకు సేవ చేయడం మానేసి చంద్రబాబుకు వాచ్‌మెన్లుగా మారారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

టీడీపీ కార్యకర్తలా డీఐజీ తీరు

పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డిపై జరిగిన దాడికి సంబంధించి డీఐజీ కోయ ప్రవీణ్ చేసిన వ్యాఖ్యలను జగన్ తీవ్రంగా తప్పుబట్టారు. పోలీసు అధికారిగా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఆయన టీడీపీ కార్యకర్త మాదిరిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. తన వృత్తిధర్మాన్ని, పోలీసు యూనిఫామ్‌పై ఉన్న జాతీయ చిహ్నం గౌరవాన్ని కూడా మర్చిపోయి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసే వ్యవస్థలో ఆయన కూడా ఒక పావుగా మారారని ఆరోపించారు.

మిథున్‌పై దాడికి సీఆర్పీఎఫ్ సాక్ష్యం

పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డిపై జరిగిన దాడికి ఆయన వెంట ఉన్న సీఆర్పీఎఫ్ భద్రతా సిబ్బందే ప్రత్యక్ష సాక్షులని జగన్ స్పష్టం చేశారు. అభ్యర్థులతో కలిసి నామినేషన్ కేంద్రానికి వెళ్లిన మిథున్‌రెడ్డిపై అక్కడే టీడీపీ శ్రేణులు దాడి చేశాయని తెలిపారు. ఒక అభ్యర్థి వెంట వెళ్లేందుకు అనుమతించిన నలుగురిలో ఒకరిగా మాత్రమే ఎంపీ అక్కడికి వెళ్లారని వివరించారు. వేలాది మంది టీడీపీ కార్యకర్తలు గుమిగూడి దాడి చేసినా పోలీసులు అడ్డుకోలేదని ఆరోపించారు. మూడు గంటలపాటు అక్కడే నిర్బంధించి నామినేషన్లు కూడా స్వీకరించలేదని మండిపడ్డారు. ఆయన వాహనాలను ధ్వంసం చేయడమే కాకుండా, అందులో మద్యం సీసాలు పెట్టి తప్పుడు ఆధారాలు సృష్టించారని ఆరోపించారు. వాహనాలు బోల్తాపడినా మద్యం సీసాలు మాత్రం నిటారుగా ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. మిథున్‌రెడ్డికి మద్యం సేవించే అలవాటు లేదని, అయినా ఆయనపై దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నించారని విమర్శించారు. సీఆర్పీఎఫ్ సిబ్బంది జరిగిన ఘటనపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తారని, వారి ప్రత్యక్ష సాక్ష్యం ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు.

నిమ్మగడ్డ హయాంలోనూ ఘనవిజయమే!

వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక ఎన్నికలను జగన్ గుర్తుచేశారు. అప్పట్లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఉన్నారని, ఆయన చంద్రబాబుకు అత్యంత సానుభూతిపరుడని విమర్శించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే అనేక మంది కలెక్టర్లు, ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలను బదిలీ చేశారని తెలిపారు. అంతటి పరిస్థితుల్లోనూ తమ ప్రభుత్వం స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం, విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత, గ్రామ సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం వల్లే స్థానిక ఎన్నికల్లో వైయస్సార్‌సీపీ అఖండ విజయాలు సాధించిందని వివరించారు.

హామీల అమలులో చంద్రబాబు విఫలం

చంద్రబాబు ప్రభుత్వంలో సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలు లేదని జగన్ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇంటింటికీ పంపిన బాండ్లను ప్రజలు ఇప్పుడు చూపిస్తూ తమకు రావాల్సిన సొమ్ము ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. గ్రామ సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన, రైతుల సంక్షేమం, మహిళా సాధికారత వంటి రంగాలన్నీ కుదేలయ్యాయని ఆరోపించారు. పాలనపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి కారణంగానే చంద్రబాబు స్వేచ్ఛగా ఎన్నికలను ఎదుర్కొనేందుకు భయపడుతున్నారని విమర్శించారు. అందుకే పోలీసు యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష అభ్యర్థులను ఎన్నికల బరి నుంచి తప్పించే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు.

దౌర్జన్యాలన్నీ తిరిగి చుట్టుకుంటాయి

ఎన్నికల్లో పోటీ చేసే హక్కు, ఓటు వేసే స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి పునాదులని జగన్ స్పష్టం చేశారు. వాటిని కాలరాసేందుకు ఎవరు ప్రయత్నించినా ప్రజలు గమనిస్తూనే ఉంటారని హెచ్చరించారు. చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాలు, ఎన్నికల ప్రక్రియలో సృష్టిస్తున్న అడ్డంకులు ప్రజల దృష్టినుంచి తప్పించుకోలేవన్నారు. ఎన్నికల కమిషనర్ ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రతి అభ్యర్థికి నామినేషన్ వేసే అవకాశం కల్పించాలని మరోసారి కోరారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించకపోతే ప్రజలే తగిన సమాధానం చెబుతారని, చంద్రబాబు చేస్తున్న దౌర్జన్యాలన్నీ చివరకు ఆయనకే చుట్టుకుంటాయని హెచ్చరించారు.



వైయస్ఆర్‌సీపీలోకి 50 కుటుంబాలు

■ ధర్మాన సమక్షంలో భారీ చేరికలు

శ్రీకాకుళం: నియోజకవర్గంలో వైయస్ఆర్‌సీపీకి ప్రజాదరణ పెరుగుతోందని, గ్రామాల్లో రాజకీయ మార్పు కనిపిస్తోందని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. గార మండలం వత్సవలస పంచాయతీ పరిధిలోని పేర్లవానిపేట, శాలిగుండం పంచాయతీలకు చెందిన సుమారు 50 కుటుంబాలు ఆదివారం వైయస్ఆర్‌సీపీలో చేరాయి. పెదపాడులోని ధర్మాన ప్రసాదరావు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ..గతంలో వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందనే అసంతృప్తి ప్రజల్లో కనిపిస్తోందని అన్నారు. రైతులకు ఎరువుల కొరత, ధాన్యం మద్దతు ధర, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వంటి సమస్యలు సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు.

గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీకి ప్రజల నుంచి విస్తృత మద్దతు లభించిందని గుర్తుచేస్తూ, ప్రస్తుతం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతుండటం రాజకీయ పరిణామాల్లో మార్పునకు సంకేతమని ధర్మాన వ్యాఖ్యానించారు. సుదీర్ఘకాలంగా టీడీపీలో కొనసాగిన గుండ కుటుంబం సైతం ఆ పార్టీని వీడి వైయస్ఆర్‌సీపీలో చేరడం, ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని ధర్మాన పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలని, ప్రభుత్వ హామీల అమలు తీరును ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని పొందుతూ సమన్వయంతో పనిచేస్తే గార మండలంతో పాటు శ్రీకాకుళం నియోజకవర్గంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ధర్మాన ప్రసాదరావు ధీమా వ్యక్తం చేశారు.

హైకోర్టులో వైయస్ఆర్‌సీపీ హౌస్ మోషన్ పిటిషన్

తాడేపల్లి: పుంగనూరు మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. పుంగనూరులో వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడంపై పార్టీ అధిష్టానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో, అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని, పోలీసు రక్షణ కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ వివాదంపై తిరుపతిలో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పుంగనూరు మున్సిపాలిటీ ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల పోటీపై ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు. అధికార పార్టీ అడ్డంకులు సృష్టించినా, ప్రజాస్వామ్య పద్ధతిలో



ఎన్నికల బరిలో నిలిచి తీరుతామని వెల్లడించారు. 'పుంగనూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేయడంపై వైయస్ఆర్‌సీపీ ఎక్కడా రాజీ పడదు. ఇది మా అభ్యర్థుల హక్కు. నామినేషన్ల ప్రక్రియలో అక్రమాలను అడ్డుకోవడానికి, మా అభ్యర్థుల న్యాయమైన హక్కులను కాపాడటానికి ఎంతటి న్యాయ పోరాటానికైనా మేము సిద్ధం'అని ప్రకటించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీ జెండా ఎగరాలి

■ పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి శైలజానాథ్ దిశానిర్దేశం

అనంతపురం జిల్లా: అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె మండలంలో వైయస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, పార్టీ సమన్వయకర్త శైలజానాథ్, నియోజకవర్గ అబ్జర్వర్ ఎల్.ఎం. మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. రానున్న ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయడం, గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడంపై నాయకులు చర్చించారు.

అభ్యర్థుల ఎంపికపై చర్చ

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గ్రామాల వారీగా రాజకీయ పరిస్థితులు, రిజర్వేషన్లు, ఆశావహ అభ్యర్థుల బలాబలాలు, ప్రజలతో వారి



సంబంధాలు తదితర అంశాలను సమీక్షించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల కార్యాచరణపై దృష్టి సారించాలని నాయకులు సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించుకుని సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించాలి

ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారి మధ్య ఉంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని నాయకులు సూచించారు. గ్రామస్థాయి నాయకుల నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేస్తూ, ప్రజలతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఐక్యతతో ఎన్నికలకు సన్నద్ధం కావాలి

గార్లదిన్నె మండలంలోని పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా పనిచేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సమావేశంలో దిశానిర్దేశం చేశారు. పార్టీ నాయకత్వం సూచించిన కార్యాచరణకు అనుగుణంగా గ్రామస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యక్రమాలను బలోపేతం చేయడం, ఎన్నికల సన్నాహాలను సమర్థంగా నిర్వహించడం సమావేశం ప్రధాన లక్ష్యంగా నిలిచింది.

రాజంపేటలో నామినేషన్లకు అడ్డంకులు..

అభ్యర్థులకు భద్రత కల్పించాలి

■ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆరోపణ



అన్నమయ్య జిల్లా: రాజంపేటలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయని వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆరోపించారు. వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకుంటున్నారని, తమను గృహ నిర్బంధంలో ఉంచి పార్టీ కార్యాలయం నుంచి బయటకు రాకుండా పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ అభ్యర్థులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రశాంతమైన రాజంపేటలో ఇదేం పరిస్థితి?

సమితి ఎన్నికల నుంచి గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల వరకు రాజంపేటలో ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ సాగేదని ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి వ్యక్తులను తీసుకొచ్చి వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

పోలీసుల తీరుపై అభ్యంతరం

మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లో టీడీపీకి చెందినవారికే పోలీసులు రక్షణ కల్పిస్తున్నారని,నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నప్పటికీ తమ అభ్యర్థులకు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసే అవకాశం కల్పించడం లేదని ఎమ్మెల్యే ఆరోపించారు. రాజంపేట సంస్కృతికి విరుద్ధంగా రాజకీయ వాతావరణాన్ని ఉద్రిక్తంగా మారుస్తున్నారని విమర్శించారు.

ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలి

నామినేషన్లు దాఖలు చేయడానికి సిద్ధంగా ఉన్న తమకు భద్రత కల్పించాలని వైయస్ఆర్‌సీపీ మున్సిపల్ అభ్యర్థులు కోరారు. ఎన్నికల సంఘం తక్షణమే స్పందించి, అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కోరారు.



ఎమ్మిగనూరులో బీజేపీకి షాక్

■ వైయస్ఆర్‌సీపీలోకి బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు బంగి రాజేష్

■ ఎర్రకోట రాజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిక

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు పట్టణంలో వైయస్ఆర్‌సీపీకి మరింత బలం చేకూరింది. భారతీయ జనతా యువమోర్చా పట్టణ అధ్యక్షుడు బంగి రాజేష్ బీజేపీని వీడి వైయస్ఆర్‌సీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజీవ్ రెడ్డి పార్టీ కండువా కప్పి బంగి రాజేష్‌ను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు బంగి రాజేష్ తెలిపారు. ఎర్రకోట రాజీవ్ రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో ఎమ్మిగనూరు పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి వైయస్ఆర్‌సీపీ శ్రేణులతో కలిసి పనిచేస్తానని బంగి రాజేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ధనుంజయ్, జగదీష్, రవి శంకర్, రాజశేఖర్, రాము, నరసింహ రాజు, తులసి పాల్గొన్నారు.

Social Buzz







